# మోసమా? లౌక్యమా?

సోమంచి రామం



“నమస్కారం నరసింహం గారూ!” అంటూ పలకరించిన పరంధామయ్యను బాగా దగ్గర కొచ్చేదాక చూడనే లేదు పరాగ్గా ఏదో ఆలోచిస్తూ, నడుస్తున్న నరసింహంగారు.

“ఓ! మీరా! చూడనేలేదు.... ఏదో....” అంటూ నసిగాడు నరసింహంగారు.

“అదే-ఏమిటి? అంత ఆలోచ

నలో పడిపోయి నడుస్తూన్నారు?" అన్నాడు పరంధామయ్య.

"ఆ!..ఏం లేదండి? ఏముంది?.. మామూలే- ఏదో సంసార విషయాలు."

"అదేమిటండీ? సంసార విషయాలు మీకొక్కరికేనా? మాకు లేవూ? కాస్తంత నాతో చెప్తే నేనూ నా గోడు చెప్పుకుంటాను ఆ తర్వాత" అంటూ పళ్ళికిలిస్తూ నవ్వాడు పరంధామయ్య.

"బాగా చెప్పారు. మీకు మాత్రం తెలియని దేముంది? పెద్ద దాన్ని ఓ యింటి దాన్ని చేసి పంపాలని..."

"ఆగండి-ఆగండి! యిలా నడిరోడ్డు మీద నిల్చుని యిద్దరం పెద్దమ్మాయిల పెళ్ళి ముచ్చట్లు చెప్తూకూర్చుంటే-అదే నిల్చుంటే-అడుగో మహానుభావుడు- ట్రాఫిక్ యిన్‌స్పెక్టరు- అప్పుడే మనకేసి గుడ్లెర్రచేసి చూస్తున్నాడు- రండి! అలా గణేష్ భవన్‌లోకి పోయి ఓ అరకప్పు కాఫీ తాగుతూ కబుర్లాడుదాం" అంటూ సదరు పరంధామయ్యగారు నరసింహంగార్ని సదరు గణేష్ భవన్‌లోకి లాక్కెళ్ళారు.

ఖాళీగా ఉన్న ఓ మూల సీటు సెలక్టు చేసికొని కూర్చున్నారు.

"బాబూ-నాయనా-సర్వారావ్! యిలా మాకేసి ఓ సారి చూస్తావ్?" అంటూ ఛలోక్తిగా ఓ సప్లైయర్ని పిలిచాడు పరంధామయ్యగారు.

"ఏం సార్? ఏం కావాలి? వేడి పెసర - మినప-బజ్జీ- ఉప్మా-ఊతప్పం-దోసె..." దండకం ప్రారంభించాడు.

"స్టాప్-స్టాప్! అంత శ్రమ నీకొద్దుబాబూ! భోజనం చేసే టైము అవుతోంది గాని-నువ్వు పోయి చెయ్యి శుభ్రంగా కడుక్కొని రెండు గ్లాసుల మంచినీళ్ళు, వన్ బై టూ స్ట్రాంగ్ కాఫీ.... ఏం నరసింహంగారూ! కాఫీయేనా, టీ త్రాగుతారా?"

"ఆ! యిప్పుడిదంతా యెందుకండీ?" అంటూ మొహమాటపడ్డాడు నరసింహంగారు.

"ఏముందండీ యిందులో? ఒట్టి కాఫీయేగా! యిదిగో మిష్టర్! కాఫీయే- స్ట్రాంగ్ - వన్‌బైటూ-గుర్తుందిగా?" అంటూ సర్వర్ని పంపేసి—

"ఆ! యిప్పుడు చెప్పండి? పెద్దమ్మాయికి పెళ్ళి సంబంధం చూడాలి-అదేగా?" అంటూ విషయమంతా పసిగట్టేసినట్లు అడిగాడు పరంధామయ్య.

"మరే - మరే! యీ యేడాది

కనీసం పెద్దమ్మాయికైనా చేసేస్తే...." ఆగాడు నరసింహం గారు.

ఈలోగా కాఫీలు, మంచినీళ్ళు వచ్చాయి. వేడి వేడి కాఫీని చప్పరిస్తూ అందుకున్నాడు పరంధామయ్యగారు—

"అయితే అక్కడికి మీరొక్కరే ఆడపిల్లల పెళ్ళిళ్ళ కోసం బాధపడిపోతున్నట్టు మాట్లాడుతున్నారే? మరి నా మాటేమిటి? నాకు మాత్రం లేరూ ఆడపిల్లలు? కాదంటే మీకు నలుగురైతే నాకు యిద్దరు. సంఖ్యలో తేడాయే గాని - సంబంధాలు వెతకడంలో నేనూ తంటాలుపడుతూనే ఉన్నానుగా?"

"అదే-మీకు తెలియనిదేముంది? పెద్దమ్మాయికి తణుకులో ఏదో సంబంధం వుందని ఎవరో చెప్తే-" ఆగాడు నరసింహంగారు.

"ఎక్కడా? తణుకులోనా?"

"మరే - మరే."

"అయితే, ఆగండి, నేను చెప్తాను- ఆ అబ్బాయి తండ్రి...."

"హైస్కూలు హెడ్మాష్టరు చేసి జిలాబోర్డులో రిటైరయ్యాడు."

"అవునవును. అదే రిటైర్డు హెడ్మాష్టరు సూర్యనారాయణ."

"అహహ! సూర్యప్రకాశరావు గారు."

"ఆ! అదే సూర్యప్రకాశరావు గారు. ఆయనకు...." అంటూ అర్థోక్తిగా ఆగిపోయారు పరంధామయ్యగారు.

"ఇద్దరే కొడుకులు. పెద్దబ్బాయి హైదరాబాదులో-" అంటూ అందించారు నరసింహంగారు.

"అవునవును. హైదరాబాదులో బి.హెచ్.ఇ.ఎల్.లో..."

"కాదు- కాదు. ఇ.పి.ఐ.యల్.లో పని. ఆరొందలు జీతమట."

"అదే- అదే! ఇ.పి.ఐ.యల్. కదూ? సరిగా గుర్తురాక బి.హెచ్. ఇ.యల్. అన్నాను" అంటూ సర్దుకున్నాడు.

"అయితే యీ సంబంధం మీకు తెలిపిందేనా?" అమాయకంగా అడిగాడు నరసింహంగారు.

"అయ్యో రామా! తెలిపిందేనా అని మెల్లగా అంటున్నారా? నేను బాగా వాకబుచేసిందే యిది. కాని-"

అంటూ నసిగాడు పరంధామయ్య.

ఇంతలో బిల్లు చెల్లించి ఇద్దరూ బయట పడ్డారు. ఈసారి ఆయన వెంట పడటం నరసింహంగారి వంతు అయింది.

"ఆ సంబంధం మంచిదే నంటారా?" అంటూ అడిగాడు నరసింహం దారిలో.

"ఇక్కడొద్దు ఆ మాటలు. రండి- అలా పార్కులో కూర్చుని మాట్లాడుకుందాం"అంటూ పార్కులోకి దారి తీశాడు.

"సంబంధం మంచిదేనా అని అంటారు కదూ మీరు? కుర్రాడు, చదువు, ఉద్యోగం - మంచివే. కానైతే.." అంటూ ఆగిపోయాడు.

అలా సస్పెన్సులో పెట్టి చంపడం ఆయన కలవాటు.

"ఊఁ! కానైతే ఏమిటి లోపం?" ఆత్రంగా అడిగాడు ఆయన.

"అబ్బే! కుర్రాడిలో లోపం ఏం లేదు. కానైతే ఆ కుర్రాడు యీ సరికే ఒకమ్మాయిని ప్రేమిస్తున్నాడని రూఢిగా తెలిసింది" అంటూ ఆగిపోయాడు.

ఈ మాటతో నరసింహంగారి నవనాడులు క్రుంగిపోయాయి.

"ఖాయం చేసుకున్నారా ఏమిటి?" అన్నాడు పరంధామయ్యే మళ్ళీ అనుమానంగా.

"అబ్బే! ఎక్కడండీ? మొన్ననే యీ విషయం తెలిసింది. అబ్బాయి తండ్రి అభ్యుదయ భావాలు కలవాడనీ, కట్నం కూడా పుచ్చుకోరనీ."

"ఆ-ఆ! కట్నంకూడా పుచ్చుకోరని- అదే...అదే...మీకూ అలాగే తెలిసిందన్నమాట?"

"మరేనండి! కట్నం లేకుండా మంచి సంబంధం గదా అని ఆశ పడ్డాను. రేపు దశమి బుధవారం మంచిది గదా బయలుదేరివెళ్ళి..."

"వెళ్ళండి. దానికేం? వెళ్ళి ప్రయత్నించండి!"

"ఆ! ఎందుకండీ యింకా? ఛార్జీలు దండగ. పోన్లెండి, ముందుగానే చెప్పి సహాయం చేశారు."

"చీకటి పడింది. యిక పోదామా?" అంటూ సదరు పరంధామయ్యగారు, నరసింహంగార్ని లేపి యింటికి సాగనంపారు.

* * *

ఆ రాత్రి భోజనాల దగ్గర నరసింహంగారు భార్యతో జరిగినదంతా చెప్పాడు.

"అయితే, అందుకని రేపు ప్రయాణం మానుకుంటారా?" అంది నిలదీసి అడుగుతూ భార్య.

"మానుకోక యెందుకే? తెలిసి తెలిసి ఆ సంబంధం చేస్తే ఆ కుర్రాడు రేప్పొద్దున్న ఆ ప్రేమించిన పిల్లతోటే కులుకుతూంటుంటే మన అమ్మాయి గతేం కాను? పరంధామయ్యగారు....నాకు బాగా ఎరుగున్న మనిషి కాబట్టి, మన మేలు కోరి ముందే చెప్పాడు."

"ఏమో! నాకు మాత్రం మన సొప్పడం లేదు. ఏదో చదువుకునే రోజుల్లో, తెలిసీ తెలియని వయసుల్లో, కలిసి మెలసి తిరిగితే-అదే ప్రేమ - ప్రేమ అంటారు. అంతే గాని...."

"ఏమైనా సరే! ఆ సంబంధం మన కొద్దులేవే! అది కాకపోతే యింకొకటి. ఆ ఘడియ వస్తే అదే కుదుర్తుంది."

"సరే! మీ మాటకు నే నెందుకెదురు చెప్పాలి?" అంటూ భోజనం ముగించిందావిడ.

* * *

"ఇంత మోసమా? ఛీ - ఛీ! యెంత దగా?" అంటూ హాల్లోనే చిందులు తొక్కుతున్న నరసింహగార్ని చూస్తూ-

"ఏమిటండీ? ఏం జరిగింది?" అంటూ ప్రశ్నించింది ఆ యిల్లాలు.

"ఇదిగో-ఈ శుభలేఖ చూడు· యెంత మోసం - యెంత దగా చేశాడో?" అంటూ శుభలేఖ ఆవిడ మీదకు విసిరేడు కోపంతో.

"ఏముంది యిందులో? వాళ్ళమ్మాయికి సంబంధం కుదిరింది కాబోలు, పెళ్ళి చేస్తున్నాడు - తప్పేముంది?"

"అవును. తప్పేముంది? తప్పు లేదుగాని, ఆ పెళ్ళికొడుకు ఎవరని అడగవేం?"

"ఎవరు?"

"ఇంకెవరే-రెండు నెలలనాడు మనం చూద్దామని బయల్దేరుతుంటే వద్దని వారించలేదూ- ఆ తణుకు సంబంధం...."

"ఆఁ! ఆ కుర్రాడా?" అంటూ ముక్కు మీద వేలేసుకుంది ఆ యిల్లాలు.

"ఉండు- ఆయన పని చెప్తాను వెళ్ళి."

"చాల్లెండి- ఊరుకోండి. వెళ్ళి ఏం చేస్తారు?"

"ఏం చేస్తానా? ఏం చేస్తానా? నాలుగూ ముఖంమీదే కడిగేస్తాను. 'ఇలా నోటి దగ్గర కూడు లాక్కుని తినొచ్చునా' అని పదిమందిలోనూ చెడా మడా అడిగేస్తాను" అంటూ ఆవేశంతో ఊగిపోతున్నాడు నరసింహంగారు.

"చాలు- చాలు ప్రయోజకత్వం! ఇంతకీ మన ఖర్మ! బంగారం లాంటి సంబంధం."

"ఎరుగున్నవాడు కదా అని సంబంధం సంగతి చెప్తే యింత మోసం చేస్తాడా?"

"అయ్యో రాతా! ఎరుగున్న వాళ్ళు చేసేది మోసం యెందుకు అవుతుందండీ? మీరే చెప్తూండే వారుగా - ఎరుగున్న వాళ్ళు చేసేది లౌక్యం అనీ, ఎరగని వాళ్ళు చేసేది మోసం అనీ."

"ఏదైతేనేం? నేను పెళ్ళికి వెళ్ళాల్సిందే, వెళ్ళి ఆయన్ని అడిగి తీరాల్సిందే."

"సర్లే, మీ యిష్టం! యిహ నేను చెప్పే దేముంది?" అంటూ యింట్లోకి వెళ్ళిపోయింది ఆవిడ చేసేదేంలేక.

* * *

"రండి - రండి! నరసింహం గారూ! శుభలేఖ అందింది కదా? అందిందో లేదో అని తెగ కంగారు పడ్డాను. రండి - అలా కూర్చోండి. ఒరేయ్! ఎవర్రా అక్కడ? ఏదీ - నరసింహంగారికి ఉప్మా, కాఫీలు పట్రండి" అంటూ ఆప్యాయంగా నరసింహంగారి భుజంమీద చెయ్యేసి తీసుకొచ్చి కూర్చో బెట్టారు పరంధామయ్యగారు.

నరసింహంగారి ఒళ్ళు కుత కుత ఉడికిపోతోంది. ఆవేశం ఆగటం లేదు.

"చూడండి పరంధామయ్యగారూ! ఈ సంబంధం..." అంటూ ఆవేశంగా కుర్చీలోంచి లేవబోయాడు.

ఇంతలో ఉప్మా ప్లేటు రావడంతోటే చేతికిచ్చి, కుర్చీలో కూర్చోబెట్టి, ఉప్మా నోట్లో పెట్టేశాడు పరంధామయ్యగారే స్వయంగా.

"కూర్చోండి! స్థిమితంగా తినండి! అదే- అప్పుడు నేను చెప్పాను కదూ మీతోటి - ఆ అబ్బాయి యెవరో అమ్మాయిని... నాకేం తెలుసు? మా పెద్దది వాళ్ళ పెద్దమ్మగారి దగ్గర హైద్రాబాదు

లోనే ఉంటుందిగా! అతనూ ఆ యింట్లోనే అద్దెకు ఉంటున్నాడట. వాళ్ళ పెద్దమ్మే దీన్ని కదలేసి - కుర్రాడు బుద్ధిమంతుడేనే - అంటే ఆ! ఆ! మంచి నీళ్ళు తాగండి! పలక మారినట్లుంది! వస్తున్నా, వస్తున్నా! నరసింహంగారూ! కాఫీ తీసికొని మరీ వెళ్ళండి. లగ్నం అయాక అంతా భోజనాల కుండాలి! వస్తా - పనుంది" అంటూ జారుకున్న పరంధామయ్య కేసి విలువు గుడ్లేసి చూడటం కన్న యింకేం చేయలేక పోయాడు నరసింహం గారు.

*


## శ్రీ బాలాజీ వైద్యశాల

**సెక్స్ స్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర**

మార్వాడీ గుడివద్ద, ఫోన్: 551, తెనాలి (ఎ.పి.)
బ్రాంచి: 26, నార్త్ బోగ్ రోడ్, మద్రాస్-17

**దీర్ఘవ్యాధులకు వుత్తమ సిద్ధ వైద్యము**



హస్త ప్రయోగంవల్ల, అతి సంభోగము వలన అంగము చిన్నదై అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక్క డోస్‌తో ఎన్నడూ, కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తిచెందు స్త్రీ, పురుషులు వాడదగినది-స్వస్థులు.) హెర్నియా (గిలక) కుష్టు, బొల్లి, చర్మవ్యాధులకు పోస్టు ద్వారా వైద్యం చేయబడును. వరిబీజము (బుడ్డ), మూత్రవ్యాధులు ఆపరేషన్ లేకుండా నయం చేయబడును. స్వయంగా రండి.

క్షయ, ఉబ్బస వ్యాధులకు వుచిత వైద్యం - రండి.

బ్రాంచీలు:- తిరుపతి, నెల్లూరు, గుంటూర్లలో త్వరలో తెరువబడును.